# 'కంబైండ్ స్టేజ్'



వాణిశ్రీ

**రామనాథానికి సెక్షన్ ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది. ఇరవై ఏళ్లపాటు ఫైళ్లు తిరగేస్తూ రొటీన్ జీవితం గడుపుతున్న అతనికి చాలా రిలీఫ్ కలిగింది. చేసే పనిలో మార్పు మాత్రమే కాక, కాస్తో కూస్తో జీతం కూడా పెరుగుతున్నందుకు అతనికి చాలా సంతోషం కలిగింది. తన ఆనందం అందరితో పంచుకోవాలనిపించి ఆఫీసులో అందరికీ స్వీట్స్ పంచి, టీ తెప్పించాడు. ఇంటికి వెళ్తూ వెళ్తూ స్వీట్స్ షాపులో కిలో స్వీట్స్ కొని తీసుకెళ్లాడు.**

అతని చేతిలో స్వీట్స్ చూస్తూనే, "ఏమిటండీ, విశేషం?" అని అడిగింది భార్య రేవతి.

"గుమస్తాలకి ఏముంటుందోయ్? ఆఫీసులో ప్రమోషన్ ఇచ్చారు!" అన్నాడు.

"అయితే జీతం పెరుగుతుందన్నమాట.ఎంత పెరుగుతుందండీ? ఒక వెయ్యి ఉంటుందా?"

"వెయ్యా, నా బొందా! ముష్టి మూడొందలుంటుందిలే! ఏదో కూరగాయల ఖర్చుకి సరిపోతుందనుకో!" అన్నాడు.

రామనాథం డ్రెస్ మార్చుకుని టీ.వీ. ముందు కూర్చున్నాడు. రేవతి ప్లేటులో స్వీట్స్ తెచ్చి ముందు పెట్టింది.

"ఇప్పుడెందుకోయ్! ఇందాకే ఆఫీసులో తీసుకున్నాను. ఈ వయసులో ఎక్కువ స్వీట్స్ తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందట!" అన్నాడు.

"కొలెస్ట్రాల్ పెరిగేది అందుకు కాదు. ఇరవైనాలుగు గంటలూ కుర్చీలకు అతుక్కుపోయి కూర్చునేవాళ్లకి పెరుగుతుంది. కాస్త పనీపాటా చేయాలి. రోజూ మార్నింగ్ వాక్‌కి వెళ్లమంటే వెళ్లరు కదా!"

రామనాథం చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

"అయితే ఆఫీసులో అందరికీ స్వీట్స్ తెప్పించారన్నమాట!" అన్నది రేవతి.

"అవునోయ్! మనిషికి ఆనందంకలిగితే అందరితోపాటు పంచుకో. దుఃఖంకలిగితే ఒంటరిగా అనుభవించాలన్నాడు ఒక పెద్దమనిషి!"

"సరే, బాగుంది! అందరికీ స్వీట్లు పంచి ఆనందించారు. మరి నాతో ఆనందం పంచుకోరా?" ప్రశ్నించింది రేవతి.

"అందుకేగా స్వీట్లు తెచ్చాను."

"అందరితోపాటు నాకూ స్వీటేనా? అదేం కుదరదు. పట్టుచీర కొనాల్సిందే!"

"అంటే సంవత్సరంలో పెరిగిన జీతమంతా నీ ఆనందానికి ఖర్చుపెట్టాలన్నమాట!"

"అంతే మరి! అప్పుడే నాకు ఆనందం."

"జ్యోతి ఏదీ కనిపించదు! పెద్దగాడిద ఎటు

పోయాడూ?"

"పెద్దగాడిద జిమ్‌కి వెళ్లి ఉంటాడు. జ్యోతి పక్కింట్లో చదువుకుంటానని వెళ్లింది."

"అక్కడెందుకూ చదువుకోవడం? ఇంట్లో చిన్న పిల్లలున్నారా, గొడవ చేస్తున్నారనడానికి?"

"సత్యమూర్తిగారి సునీతతోపాటు కంబైండ్ స్టడీ చేస్తున్నది. ఇద్దరూ ఒకే క్లాస్ కదా! వచ్చేవి పబ్లిక్ పరీక్షలనీ, బాగా చదవాలనీ అన్నది."

భార్య చెప్పింది విని మురిసిపోయాడు రామనాథం. ఆడపిల్లలే నయం. బుద్ధిగా చదువుతారు. మగపిల్లలకు తిరుగుడే తిరుగుడు. జ్యోతికి ఇంటంర్‌లో క్లాస్ వస్తే ఎంసెట్ రాయించాలి. మంచి రాంక్ వస్తే మెడిసన్ చేయించాలి అనుకున్నాడు.

"బాక్స్‌లో నాలుగు స్వీట్లు పెట్టివ్వవోయ్! సత్యమూర్తి గారింట్లో ఇచ్చి వస్తాను. ఆనందం పక్కింటి



వాళ్లతో కూడా పంచుకోవాలి కదా!" అన్నాడు నవ్వుతూ.

రేవతి స్టీల్‌బాక్స్‌లో స్వీట్స్ పెట్టి ఇచ్చింది. రామనాథం పక్కింటికి వెళ్లాడు.

సత్యమూర్తి ఇంట్లోనే ఉన్నాడు.

"రండి, రండి రామనాథంగారూ! ఊరక రారు మహాత్ములని. రాకరాక వచ్చారు. ఏదో విశేషం ఉంది!" అన్నాడు నవ్వుతూ.

"మీ రెవిన్యూ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. ఎవరొచ్చినా పని కోసమే వస్తారని మీ గట్టి నమ్మకం కాబోలు. నేనేం పనిమీద రాలేదు. నాకు ప్రమోషన్ వచ్చింది. ఆ ఆనందం మీతో పంచుకుందామని వచ్చాను. ఇవిగోండి, స్వీట్స్!" అన్నాడు రామనాథం.

"అయితే కంగ్రాచ్యులేషన్స్!" అన్నాడు సత్యమూర్తి.

సత్యమూర్తి భార్య కాఫీ ఇచ్చి వెళ్లింది.

"మీ అన్నయ్యగారికి ప్రమోషన్ వచ్చిందటోయ్! ఇక ట్రూ కాపీలమీద సంతకాలకి గెజిటెడ్ ఆఫీసర్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగక్కర్లేదు!" అన్నాడు సత్యమూర్తి.

"చాలా సంతోషం అన్నయ్యగారూ! అయితే ఈ నెలలో వదినగారి ఖాతాలో మరొక పట్టుచీర చేరుతుందన్నమాట!" అన్నది.

"ఈ ప్రపంచంలో ఆడవాళ్లందరివీ పట్టుచీరల బుద్ధులే!" అన్నాడు రామనాథం.

అంతా నవ్వుతున్నారు.

ఇద్దరూ కొంచెంసేపు మాట్లాడుకున్నారు.

"పిల్లలేం చేస్తున్నారు? బాగా చదువుతున్నారా?" అడిగాడు రామనాథం.

"లోపల కంబైండ్ స్టడీ చేస్తున్నారు. చూసి రండి!" అన్నాడు సత్యమూర్తి.

రామనాథం లేచాడు.

రూమ్ తలుపు కొంచెం తెరిచి ఉంది. లోపల్నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"చిరంజీవి ఫస్ట్ సినిమా ఖైదీ కదే!"

"నీ మొహం! ప్రాణం ఖరీదు!"

"చిరంజీవి అసలు పేరేది శివశంకర్ కదూ!"

"శివశంకర వరప్రసాద్."

"అబ్బో, అంత పొడుగుందా! అందుకే షార్టుగా చిరంజీవి అని పెట్టుకున్నాడు."

"కృష్ణ వందో చిత్రం ఏది?"

"అల్లూరి సీతారామరాజు."

"ఇప్పటివరకూ రికార్డు కలెక్షన్స్ వచ్చిన సినిమా ఏదీ?"

"పెదరాయుడు."

"కాదు, పెళ్లిసందడి!"

"కాదు, పెదరాయుడే!"

"మా పెళ్లిసందడికే రికార్డు కలెక్షన్స్ వచ్చాయని అరవింద్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు, తెలుసా?"

"జ్యోతీ!" పెద్దగా అరిచాడు రామనాథం. అతని ముఖం కోపంతో ఎర్రబడింది.

"ఏమిటే మీరు చదివేది? సినిమా కబుర్లా - కంబైండ్ స్టడీ అంటే?" కేకలు పెట్టాడు.

"అది కాదు, డాడీ! రేపు సినిమా క్విజ్ ప్రోగ్రామ్ కోసం ప్రిపేరవుతున్నాం!"

"అదేమిటి?"

"టీ.వీ.లో వస్తుంది, డాడీ! మేమిద్దరం టీ.వీ. స్టూడియోకి వెళ్తున్నాం. క్విజ్‌లో పార్టిసిపేట్ చేయడానికి సెలెక్టయ్యాం! గెలిస్తే మంచి ప్రైజెస్ ఇస్తారు!"

"అవును, అంకుల్! మమ్మల్ని మీరంతా టీ.వీ.లో చూడొచ్చు!" అన్నది సునీత.

రామనాథం నోరువడిపోయిన వాడిలా వాళ్లిద్దర్నీ చూస్తుండిపోయాడు.

Ⓟ

